## క్లుప్తంగా

### ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్ల పంపిణీ



కంకిపాడు: ఎండల తీవ్రత నేపథ్యంలో ఉపాధి కూలీలు అప్రమత్తంగా ఉండాలని ఆశా కార్యకర్తలు సూచించారు. మండలంలోని కోలవెన్ను గ్రామంలో ఉపాధి పనులు చేస్తున్న కూలీల వద్దకు గురువారం వెళ్లి ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆశా కార్యకర్తలు కె.మానస, రజిని, మెర్సీ, స్థానిక సచివాలయ ప్రతినిధులు పాల్గొన్నారు.

### బాలికలు ధైర్యంగా ఉండాలి



కంకిపాడు: బాలికలు ధైర్యంగా ఉండాలని తెన్నేరు మహిళా సంరక్షణ కార్యదర్శి రగ్మ సూచించారు. మండలంలోని తెన్నేరు శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలు గురువారం కూడా కొనసాగాయి. చిన్నారులకు క్యారమ్స్, చెస్ పోటీలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాల పారాయణం, కథలు వినిపించడం, చదవడంపై శిక్షణ ఇచ్చారు. మహిళా సంరక్షణ కార్యదర్శి రగ్మ మాట్లాడుతూ.. బాలికల శరీరంలో కలిగే మార్పులను గమనించి దాడులను ధైర్యంగా ఎదుర్కొనాలని సూచించారు. సమస్యను చూసి పారిపోకుండా మనోధైర్యంగా ముందుకు సాగాలన్నారు. వేసవి శిబిరాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు.

### బైక్ పార్కింగ్ విషయమై దాడి

పెనమలూరు: బైక్ పార్కింగ్ విషయమై తలెత్తిన వివాదంతో వ్యక్తిపై మరో వ్యక్తి దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. తాడిగడప రామానగర్‌లో గజ్జల నరేష్ నివసిస్తున్నాడు. అతని ఇంటి పక్కనే ఉంటున్న సుబ్రహ్మణ్యంతో బైక్ పార్కింగ్ విషయమై తగాదా తలెత్తింది. దీంతో గజ్జల నరేష్‌పై సుబ్రహ్మణ్యం దాడి చేశాడు. నరేష్‌కు తీవ్ర గాయాలు అయ్యాయి. బాధితుడి సోదరి పులి భాగ్యలక్ష్మి ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### మహిళపై సోదరుడి దాడి

పెనమలూరు: మండలంలోని కానూరు సనత్ నగర్‌లో ఓ మహిళపై ఆమె సోదరుడు దాడి చేయటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. సనత్‌నగర్ కబరస్తాన్ రోడ్డులో ఎండీ మున్ని, తన భర్త షఫీఉల్లాబేగ్‌తో కలిసి తన సోదరి షమీమున్నీసా ఇంట్లో అద్దెకు ఉంటోంది. ఆమెతో అనారోగ్యంతో ఉన్న తండ్రి ఇబ్రహీం కూడా ఉంటున్నాడు. మున్ని ఇంటికి ఆమె సోదరుడు ఎండీ కరీముల్లా వచ్చి తండ్రి ఇబ్రహీంను ఇక్కడ ఎందుకు ఉంచావంటూ ఆగ్రహంతో విచక్షణ రహితంగా దాడి చేశాడు. గాయపడిన బాధితురాలు ఫిర్యాదు చేయటంతో పోలీసులు కేసు నమోదు చేశారు.

### 23 నుంచి ఉత్తమ వలంటీర్లకు పురస్కారాలు

ఉంగుటూరు: మండలంలోని వలంటీర్లకు ఈ నెల 23 నుంచి 26 వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శేషగిరిరావు తెలిపారు. స్థానిక విలేకరులతో గురువారం ఆయన మాట్లాడుతూ మండలంలోని 16 గ్రామ సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న 294 మంది సేవా మిత్ర, అయిదుగురు సేవారత్న అవార్డులను అందుకోనున్నారని తెలిపారు. వలంటీర్ల ప్రశంసా కార్యక్రమం గ్రామాలవారీగా ఈనెల 23న ఆముదాలపల్లి, ఆత్కూరు, ఇందుపల్లి, 24న మానికొండ, నందమూరు, పెద అవుటపల్లి, 25న ముక్కపాడు, పొట్టిపాడు, తరిగొప్పల, వేంపాడు, 26న తేలప్రోలు, ఉంగుటూరు, నాగవరప్పాడు గ్రామ సచివాలయాల్లో జరుగుతుందన్నారు. కార్యక్రమానికి ఎంపీటీసీలు, సర్పంచులు, గ్రామ స్థాయి అధికారులు, సిబ్బంది హాజరు కావాలని సూచించారు.

### భర్త అదృశ్యంపై భార్య ఫిర్యాదు

పెనమలూరు: తన భర్త అదృశ్యమయ్యాడని ఓ మహిళ ఫిర్యాదు చేయటంతో పెనమలూరు పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. కానూరు మహదేవపురంకాలనీకి చెందిన పులపా దుర్గాభవాని భర్త వెంకటరమణ ప్రసాదం పాడులో ముఠా పని చేస్తాడు. ఈ నెల 16వ తేదీన అతను ముఠా పనికి వెళ్లాడు. రాత్రి ఇంటికి రాలేదు. దుర్గాభవాని ఫోన్ చేస్తే దారిలో ఉన్నాను, వచ్చేస్తున్నానంటూ సమాధానం ఇచ్చాడు. అయినా అతను ఇంటికి రాకపోవటంతో మళ్లీ ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ అని వచ్చింది. భర్త కోసం పలు చోట్ల గాలించినా అతని ఆచూకీ తెలియలేదు. దీంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు కేసు నమోదు చేశారు.

# వలంటీర్ల సేవలకు వందనం



పెనమలూరులో అనాథకు పింఛన్ పంపిణీచేస్తున్న వలంటీర్

పెనమలూరు/కంకిపాడు: సమాజంలో ప్రజలకు ఉత్తమ సేవలు అందించడమే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హుల చెంతకు చేరుస్తున్న గ్రామ/వార్డు వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహకాలు ప్రకటించింది. పెనమలూరు నియోజకవర్గంలో కంకిపాడు, పెనమలూరు, ఉయ్యూరు మండలాలకు సంబంధించి ఆరుగురు వలంటీర్లు సేవ వజ్ర, 16 మంది సేవా రత్న, 1,350 మంది సేవా మిత్ర పురస్కారాలకు ఎంపికయ్యారు. పెనమలూరు మండలంలో డాక్టర్ వైఎస్సార్ తాడిగడప మునిసిపాలిటీ, మిగిలిన గ్రామాలు, ఉయ్యూరు మునిసిపాలిటీ మినహా మిగిలిన గ్రామాలు, కంకిపాడు మండలంలో 1,380 మంది వలంటీర్లు సేవలు అందిస్తున్నారు. వారి పని తీరును పరిశీలించి ఉత్తమ సేవలు అందించిన వలంటీర్లను గుర్తించారు. పెనమలూరు మండలంలో మొత్తం 864 మంది వలంటీర్లకు ముగ్గురు సేవా వజ్ర, ఆరుగురు సేవా రత్న, 855 సేవా మిత్రకు ఎంపిక్యయ్యారు. గంగూరు సచివాలయం-2లో పని చేస్తున్న వద్దాది నాగలక్ష్మి, చావా సునీత అందించిన సేవలను గుర్తించిన ప్రభుత్వం వారికి సేవ వజ్ర అవార్డులు ప్రకటించింది. వారికి రూ.30 వేల చొప్పున ప్రోత్సాహకాలను అందించనుంది. చోడవరం గ్రామం నుంచి చోడవరం ధనలక్ష్మి, పెదపులిపాక నుంచి గంధం శ్రీదేవి, వణుకూరు నుంచి వణుకూరు వనజ, గోసాల నుంచి జంజనం శ్రీలక్ష్మి, బి.ఎల్.వి.ఆంజనేయప్రసాద్‌ను ఎంపిక చేశారు. వారికి రూ.20 వేల చొప్పున ప్రోత్సాహకాలు అందజేస్తుంది. సేవామిత్రకు ఎంపికైన వారికి రూ.10 వేల చొప్పున నగదు బహుమతులు ఇస్తారు. కంకిపాడు మండలంలో 323 మంది వలంటీర్లు ఉన్నారు. వారిలో ఇద్దరు సేవా వజ్ర, ఐదుగురు సేవా రత్న, 316 మంది సేవా మిత్ర పురస్కారాలకు, ఉయ్యూరు మండలంలో 193 మంది వలంటీర్లు ఉండగా ఒకరు సేవా వజ్ర, ఐదుగురురు సేవా రత్న, 165 మందికి సేవా మిత్ర పురస్కారాలను ఎంపికయ్యారు.

**రేపటి నుంచి వలంటీర్ల పండుగ**

ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఆధ్వర్యంలో శుక్రవారం నుంచి నెల రోజులపాటు వలంటీర్ల పండుగ జరగనుంది. పెనమలూరులో ఈ నెల 23వ తేదీన వలంటీర్లకు పండుగ నిర్వహించనున్నారు. ఈ మేరకు వలంటీర్లకు ప్రోత్సాహకాల ప్రదానోత్సవం ఆ రోజు ఉదయం ఎనిమిది గంటలకు గోసాల వాటర్ ట్యాంకు వద్ద వణుకూరు, గోసాల, గంగూరు గ్రామ పంచాయతీల వలంటీర్లకు పండుగ కార్యక్రమం ఉంటుంది. అదే రోజు సాయంత్రం ఐదు గంటలకు పెనమలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద పెనమలూరు, పెదపులిపాక, చోడవరం గ్రామాల వలంటీర్లకు పండుగ చేస్తారు.

**మరింత ఉత్సాహం**



వలంటీరు వ్యవస్థ తీసుకొచ్చాక సేవ చేయాలనే ఉద్దేశంతో వలంటీరుగా చేరాను. మూడేళ్లుగా వలంటీరుగా ప్రజలకు సేవలు అందిస్తున్నా. ఈ ఏడాది నా సేవలను గుర్తించి సేవా రత్న అవార్డును ప్రకటించారు. ఎంతో సంతోషంగా ఉంది. మరింత ఉత్సాహంగా పనిచేసి ప్రభుత్వ కార్యక్రమాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్తాను. ప్రజలకు మేలు జరిగేలా కృషి చేస్తా.

– కొల్లూరి దిలీప్, సేవారత్న, కంకిపాడు

# గ్రూప్-2 పరీక్షలకు ఉచిత శిక్షణ

పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

పెనమలూరు: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నిర్వహించే గ్రూప్-2 పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ ఇస్తామని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి తెలిపారు. ఆయన గురువారం పెనమలూరులో ఈ వివరాలను తెలిపారు. నియోజకవర్గంలో నిరుద్యోగ యువతీ యువకులకు గంటూరుకు చెందిన టార్గెట్ ఐఏఎస్ అకాడమీ సహకారంతో ఉచితంగా శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణకు సంబంధించిన మెటీరియల్‌ను 50 శాతం రాయతీతో పంపిణీచేస్తారని, మిగితా 50 శాతం ఖర్చు తాను భరిస్తానని తెలిపారు. యువత శిక్షణ పొంది లక్ష్యాన్ని సాధించాలని సూచించారు. ఆసక్తి కలిగిన యువతీ యువకులు తన కార్యాలయం సెల్ నంబరు 79959 64545కు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. అకాడమీ నిర్వహకుడు శ్రీనివాస్ మాట్లాడుతూ.. దాదాపు రూ.25 వేల ఖర్చయ్యే శిక్షణను ఉచితంగా అందిస్తామన్నారు. రిజిస్ట్రేషన్ ఫీజు రూ.1000 చెల్లించాలని సూచించారు.

డిగ్రీ పూర్తిచేసిన నిరుద్యోగులు ఈ నెల 31వ తేదీ నాటికి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వచ్చే నెల ఒకటో తేదీ నుంచి ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో శిక్షణ ఇస్తామన్నారు. మరిన్ని వివరాలకు 90305 62728, 94409 89629 నంబర్లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవాలని కోరారు.

# కుటుంబ పార్టీలకు బీజేపీ దూరం

గన్నవరం: కుటుంబ రాజకీయ పార్టీలకు బీజేపీ దూరంగా ఉంటుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బిట్రా శ్రీమన్నారాయణ అన్నారు. స్థానిక సాయి మిథుల కన్వెన్షన్ సెంటర్‌లో శుక్రవారం జరగనున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం ఏర్పాట్లను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ప్రధాన మంత్రిగా నరేంద్రమోదీ బాధ్యతలు చేపట్టి తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 30 నుంచి నెల రోజుల పాటు కార్యక్రమాలను చేపట్టనున్నట్లు తెలిపారు. మోదీ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లడంపై రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో కార్యాచరణ రూపొందించనున్నట్లు చెప్పారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు నేతృత్వంలో జరగనున్న ఈ సమావేశానికి పలువురు జాతీయ, రాష్ట్ర నాయకులు విచ్చేయనున్నట్లు తెలిపారు. రాష్ట్రానికి చెందిన 700 మంది వరకు ప్రతినిధులు, ఆహ్వానితులు పాల్గొంటారని చెప్పారు. బీజేపీ, జనసేన మిత్రపక్షం కొనసాగుతుందని, టీడీపీ వంటి కుటుంబ పార్టీలతో కలిసేది లేదని స్పష్టం చేశారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి భూపతిరాజు శ్రీనివాసవర్మ, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గుత్తికొండ రాజబాబు, ఎస్.శేషుకుమార్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కె.శ్రీనివాసరావు, మండల అధ్యక్షులు తోట మురళీధర్, ఎ.చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సాగు నీటి వృథాకు అడ్డుకట్ట

- ప్రొద్దుటూరు చానల్ రిటైనింగ్ వాల్ పనులు ప్రారంభం
- రూ.59 లక్షల అంచనా వ్యయంతో నిర్మాణ పనులు



రిటైనింగ్ వాల్ నిర్మాణానికి సిద్ధమైన బెడ్‌లు

కంకిపాడు: సాగు నీటి వృథాకు అడ్డుకట్ట వేసేందుకు ఇరిగేషన్‌శాఖ చర్యలు తీసుకుంది. నీటి విడుదల సమయంలో కట్టలు దాటుకుంటూ పంట పొలాలు ముంపు బారిన పడకుండా శాశ్వత పరిష్కారానికి రిటైనింగ్ వాల్ నిర్మాణాన్ని చేపట్టింది. ప్రస్తుతం బెడ్ వర్క్ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇరిగేషన్ శాఖ కంకిపాడుసెక్షన్ పరిధిలో ప్రొద్దుటూరు చానల్ ఉంది. కంకిపాడు లాకుల నుంచి ప్రొద్దుటూరు, దావులూరు, చలివేంద్రపాలెం మీదుగా నీటి ప్రవాహం జరుగుతోంది. సాగుకు నీటిని విడుదల చేసిన క్రమంలో ప్రొద్దుటూరు చానల్‌లో వంతెన ఎగువ, దిగువ ప్రాంతాల్లో కాలువ కట్ట అంచులు దాటుకుంటూ పంట పొలాల్లోకి నీరు ప్రవహించేది. దీంతో పంట పొలాలు ముంపునకు గురై రైతులు ఆర్థికంగా నష్టపోయిన సందర్భాలు ఉన్నాయి. ఈ సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి ఉన్నతాధికారులతో చర్చించారు. రిటైనింగ్ వాల్ నిర్మాణంతో సాగునీటి వృథాకు అడ్డుకట్ట వేయడంతో పాటు పంట పొలాల ముంపు సమస్యకు పరిష్కారం లభిస్తుందని సూచించారు. ఈ మేరకు గతేడాది ప్రొద్దుటూరు చానల్‌లో 260 మీటర్ల పొడవున రిటైనింగ్ వాల్ నిర్మాణానికి మెయింటెనెన్స్ గ్రాంటు కింద రూ.59 లక్షలు నిధులు మంజూరయ్యాయి. సాంకేతిక అనుమతులు వచ్చే సరికి కాలువలకు సాగునీటిని విడుదల చేశారు. దీంతో పనులు చేపట్టేందుకు ఆస్కారం లేకుండా పోయింది. ప్రస్తుతం కాలువలో నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో ఇరిగేషన్ శాఖ రిటైనింగ్ వాల్ పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం వంతెన దిగువన బెడ్ వర్క్ చేపట్టారు. సాగునీటి విడుదల నాటికి రిటైనింగ్ వాల్ పనులు పూర్తి చేసి నీటి వృథాకు అడ్డుకట్ట వేస్తామని ఇరిగేషన్ కంకిపాడు సెక్షన్ ఏఈ వీరాంజనేయులు తెలిపారు.

### చలివేంద్రం ఏర్పాటు

కంకిపాడు: రత్న ఏజెన్సీస్ హెచ్‌పీ గ్యాస్ కంపెనీ వద్ద గురువారం చలివేంద్రం ప్రారంభించారు. రత్న ఏజెన్సీస్ అధినేత జంగాల విప్లవ్ ఈ చలివేంద్రాన్ని ప్రారంభించి పాదచారులకు మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది, మార్కెట్‌యార్డు సిబ్బంది పాల్గొన్నారు.

### సృజనాత్మకత వెల్లడికి చిత్రలేఖన పోటీలు దోహదం

గన్నవరంరూరల్: చిత్రలేఖనంతో విద్యార్థుల్లోని సృజనాత్మకత వెల్లడి అవుతుందని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం అన్నారు. స్థానిక గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించి విజేతలను ఎంపిక చేశారు. ముస్తాబాద శాఖా గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపులో భాగంగా విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. లైబ్రేరియన్ కె.జ్యోతి కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు జరిగాయి.

### వీరపనేనిగూడెం మాజీ ఉపసర్పంచ్ వెంకటరెడ్డి మృతి



మాజీ ఉపసర్పంచ్ వెంకటరెడ్డి(ఫైల్)

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేని గూడెం గ్రామానికి చెందిన సీనియర్ వైఎస్సార్ సీపీ నాయకుడు, మాజీ ఉప సర్పంచ్ బండి వెంకట రెడ్డి(61) అనారోగ్యంతో గురువారం స్వగృహంలో మృతి చెందారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఆయన చురుకైన నాయకుడిగా వ్యవహరించారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. సర్పంచ్ ఆరేపల్లి జేజమ్మ, ఉపసర్పంచ్ బండి నాగసాంబిరెడ్డి, ఎంపీటీసీ సభ్యురాలు నందిపాటి పద్మావతి, సహకార బ్యాంకు చైర్ పర్సన్ బొమ్మారెడ్డి శ్రీనివాసరెడ్డి, పాలకేంద్రం అధ్యక్షుడు ఉయ్యూరు శ్రీరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నందిపాటి సుబ్బారెడ్డి, మధుసూదనరెడ్డి, బత్తుల లోకేశ్వరరెడ్డి, ఆరేపల్లి వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచ్ బత్తుల పానకాలు వెంకటరెడ్డి మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

# ప్రకృతి సాగుతో ఎన్నో ప్రయోజనాలు

జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి పార్థసారథి



కూరగాయల పంటను పరిశీలిస్తున్న పార్థసారథి, శివప్రసాద్ తదితరులు

కోనేరుసెంటర్: ప్రకృతి సాగుతో రైతులకు అనేక ప్రయోజనాలు చేకూరుతాయని జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి కె.పార్థసారథి అన్నారు. బందరు మండలం నెలకుర్రు పంచాయతీ పరిధిలోని గొల్లపాలెంకు చెందిన రైతు గోరిపర్తి వీరవెంకట్రావు తన పొలంలో వేసవిలో ప్రకృతి వ్యవసాయం పద్ధతిలో కూరగాయల సాగు చేస్తూ లబ్ధి పొందుతున్నాడు. జిల్లా ప్రకృతి వ్యవసాయాధికారి పార్థసారథి మండల వ్యవసాయాధికారి జీవీ శివప్రసాద్‌తో కలిసి గురువారం వెంకట్రావు పొలాన్ని సందర్శించారు. రైతు వెంకట్రావును ఆయన అభినందించారు. ఈ సందర్భంగా పార్థసారథి మాట్లాడుతూ రైతులు వేసవిలో ప్రకృతి వ్యవసాయం ద్వారా కూరగాయల సాగు చేసుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయం చేయడం ద్వారా నేలలో సూక్ష్మజీవులు అభివృద్ధి చెందడంతో పాటు నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం నేలకు పెరుగుతుందన్నారు. రైతు వెంకట్రావు మాట్లాడుతూ ఐదేళ్లుగా ఘన జీవామృతం, నవ ధాన్యాలు సాగు చేస్తున్నామని చెప్పాడు. ఈ ఏడాది కూరగాయలు పండించడంతో పాటు పశువుల మేత కోసం జొన్న, పిల్లిపెసర వేశానని చెప్పాడు. తద్వారా రోజుకు రూ. 1000 వరకు ఆదాయం లభిస్తుందన్నాడు. పండించిన కూరగాయలను పొలం వద్దనే విక్రయిస్తూ లబ్ధి పొందుతున్నానని వివరించాడు.

# ఆక్రమణలో ఉన్న భూముల పరిశీలన



ఆక్రమణకు గురైన భూములు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వంశీ, ఎంపీపీ రవి, తోట వెంకయ్య, తహసీల్దార్ నరసింహారావు

గన్నవరంరూరల్: అర్హులైన పేదలందరికీ ఇళ్ల స్థలాలు ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే డాక్టర్ వల్లభనేని వంశీ అన్నారు. మండలంలోని సూరంపల్లి గ్రామంలో గురువారం ఆయన ఎంపీపీ అనగాని రవి, తహసీల్దార్ సీహెచ్ నరసింహారావుతో కలసి ఆక్రమణలలో ఉన్న ప్రభుత్వ భూములను, చెరువు భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నవరత్నాలు, పేదలందరికీ ఇళ్ల కార్యక్రమంలో భాగంగా మొదటి విడత అర్హులైన వారందరికీ చాలావరకూ ఇళ్ల స్థలాలు ఇచ్చామని, రెండవ దశలో ఇవ్వాలనే క్రమంలో ఆక్రమణల్లో ఉన్న ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్నామన్నారు. గ్రామంలో అనేక భూములు, చెరువులు ఎన్నో సంవత్సరాల నుంచి రాజకీయ నాయకులు, పరపతి కలిగిన వారి చేతుల్లో ఉన్నాయన్నారు. ఇవన్నీ పేదలకు పంచాల్సిన భూములని, ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సిన భూములే అని అన్నారు. ఆక్రమణదారులపై స్పందన కార్యక్రమం, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల ద్వారా వివిధ గ్రామాల నుంచి అనేక ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటిని పరిశీలించేందుకు వచ్చామన్నారు. వీటిలో కొంత మంది పెద్దలు ఫెన్సింగ్‌లు కూడా వేసుకున్నారన్నారు. గ్రామంలోని సూరాయిచెరువు, పెరుమాళ్ళ కుంట, గంగినేని చెరువు, కొత్త చెరువు వీటన్నింటిని పూర్తిగా ఆక్రమణలతో నింపేశారన్నారు. వాటిలో ఆక్రమణలు తొలగించి, భూమి లేని నిరుపేదలకు, ఇళ్ల పట్టాలు ఇవ్వాల్సి ఉందన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోట వెంకయ్య, సర్పంచ్ పులపాక బాబూరావు, ఎంపీటీసీ సభ్యుడు కొండా సీతారామయ్య, నాయకులు పామర్తి మాధవరావు, కూరాకుల కోటేశ్వరరావు, ఖాజా సుబ్బారావు, బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

### ఘర్షణపై పరస్పర ఫిర్యాదులు

పెనమలూరు: మండలంలోని యనమలకుదురులో పలువురి మధ్య ఘర్షణ జరగటంతో పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు.. యనమలకుదురు గణపతినగర్‌కు చెందిన కొక్కిలిగడ్డ రాజేష్ అదే ప్రాంతంలో వెల్డింగ్ షాపు నిర్వహిస్తున్న మోపిదేవి రమేష్ వద్ద పని చేస్తున్నాడు. అయితే జీతం చెల్లించే విషయంలో రాజేష్‌కు యజమాని రమేష్‌కు మధ్య వివాదం తలెత్తింది. దీంతో రాజేష్, అతని తండ్రి రామకృష్ణపై రమేష్ మరి కొందరు వ్యక్తులు దాడి చేశారు. ఈ ఘటన పై రామకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. తన పై రాజేష్, రామకృష్ణ, మరి కొందరు దాడి చేశారని మోపిదేవి రమేష్ ఫిర్యాదు చేశాడు. పోలీసులు కౌంటర్ కేసులు నమోదు చేశారు.

### ఉచితంగా మజ్జిగ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: వేసవి ఎండ తీవ్రత అధికం కావటంతో హనుమాన్‌జంక్షన్ కూడలిలో సత్యసాయిబాబా సేవా సమితి ఆధ్వర్యంలో గురువారం ఉచితంగా మజ్జిగ పంపిణీ చేశారు. స్థానిక రామాలయం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో పాదచారులు, ప్రయాణికులు, హనుమజ్జయంతి ఉత్సవాలకు వచ్చే భక్తులకు మజ్జిగ అందించారు. సుమారు 1200 మందికి ఉచితంగా మజ్జిగ పంపిణీ చేసినట్లు సమితి అధ్యక్షుడు బెక్కం వెంకటేశ్వరరావు తెలిపారు. సమితి సభ్యులు చలమలశెట్టి వెంకటేశ్వరరావు, మహిళా విభాగం సభ్యులు పాల్గొన్నారు.

# సీఎం సభకు చకచకా ఏర్పాట్లు



సభా ప్రాంగణంలో జరుగుతున్న పనులు



ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పేర్ని నాని


- 22న బందరు పోర్టు పనుల ప్రారంభం
- పరిశీలించిన ఎమ్మెల్యే పేర్ని నాని

మచిలీపట్నంటౌన్: జిల్లా ప్రజల చిరకాల వాంఛ బందరు పోర్టు పనులను ఈ నెల 22వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా నగరంలోని సర్కారుతోట స్విమ్మింగ్ పూల్ పక్కనున్న భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ స్థలంలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. నగర సమీపంలోని తపసిపూడి సముద్రతీరాన గంగమ్మ తల్లికి హారతులు ఇచ్చి పోర్టు పనులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)తో కలిసి ప్రారంభించనున్నారు. అనంతరం ఇక్కడ జరిగే బహిరంగ సభకు విచ్చేసి ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ బహిరంగ సభ నిర్వహణకు సంబంధించి ప్రస్తుతం సభా ప్రాంగణానికి హాజరయ్యే ప్రజలకు ఎండ నుంచి రక్షణ కల్పించేందుకు టెంట్లు వేసే పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఇప్పటికే ప్రజలు కూర్చునేందుకు కుర్చీలు కూడా చేరాయి. బహిరంగ సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఎయిర్‌కూలర్లు, తాగునీరు సిద్ధం చేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఈ పనులను స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని), వైఎస్సార్ సీపీ యువజన విభాగం జోనల్ ఇన్‌చార్జి పేర్ని కృష్ణమూర్తి (కిట్టు), మైనార్టీ విభాగం జోనల్ ఇన్‌చార్జి షేక్ సలార్‌దాదా, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ షేక్ అచ్చెబా, అర్బన్ బ్యాంక్ మాజీ చైర్మన్ బొర్రా విఠల్, కేడీసీసీబీ డైరెక్టర్ గడిదేశి బాలజేసు, పలువురు కార్పొరేటర్లు పరిశీలించారు.

**పోర్టు నిర్మాణాన్ని స్వాగతిస్తున్నాం: సీపీఎం**

మచిలీపట్నంటౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఈ నెల 22వ తేదీన బందరు పోర్టు నిర్మాణ పనులు ప్రారంభించడాన్ని తమ పార్టీ స్వాగతిస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి వై.నరసింహారావు అన్నారు. నగరంలోని బుట్టాయిపేట సీపీఎం కార్యాలయంలో గురువారం పోర్టు నిర్మాణ పనుల ప్రారంభ నేపథ్యంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మచిలీపట్నంతో పాటు కృష్ణా జిల్లా ప్రజల చిరకాల వాంఛగా ఉన్న పోర్టు నిర్మాణానికి తమ పార్టీ మద్దతు తెలుపుతోందన్నారు. పోర్టు నిర్మాణంతో కృష్ణా జిల్లా సమగ్రాభివృద్ధి జరుగుతుందన్నారు. పోర్టు నిర్మాణానికి భూములు ఇచ్చిన ఏక్‌సాల్ లీజుదారుల కుటుంబాల వారికి పోర్టు నిర్మాణ పనుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని, పోర్టు నిర్మాణ గ్రామాల్లో ప్రజలకు సివిల్ పనులతో పాటు నిర్మాణ పనుల్లో ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. సమావేశంలో సీపీఎం నగర కార్యదర్శి బూర సుబ్రహ్మణ్యం, సీఐటీయూ జిల్లా కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎం. పోలినాయుడు, జిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కేవీ గోపాలరావు, సీఐటీయూ నగర కార్యదర్శి జయరావు తదితరులు పాల్గొన్నారు.

### పకడ్బందీగా ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ



చిలకలపూడి(మచిలీపట్నం): ఓటర్ల నమోదు, అభ్యంతరాల స్వీకరణ పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా అన్నారు. గురువారం సాయంత్రం సచివాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ పి.రాజాబాబు పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించి ఆయన పలు అంశాలపై చర్చించారు. ఓటరు నమోదులో వచ్చిన అభ్యంతరాలు, కొత్తగా నమోదైన ఓటు కార్డుల పంపిణీ, ఎన్నికల సమయంలో నగదు, ఇతర వస్తువులు పట్టుబడినప్పుడు అనుసరించాల్సిన పద్ధతులు, విధివిధానాలపై ఆయన చర్చించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎం.వెంకటేశ్వర్లు, దిశ డీఎస్పీ యు. నాగరాజు, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ శివాజీ, ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల డెప్యూటీ తహసీల్దార్లు పాల్గొన్నారు.